## క్లుప్తంగా

### సీపీఐ ప్రచార జాతా

నూజివీడు: ప్రజా సంక్షేమం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య ధ్వజమెత్తారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచార జాతా బుధవారం రాత్రి నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, ముసునూరు మండలం వేల్పుచర్లలో జరిగింది. ఆయా కార్యక్రమాల్లో కృష్ణ చైతన్య మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

### ప్రజా సమస్యలపై పోరుబాట

నూజివీడు: కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ హామీల అమలు కోరుతూ ప్రజా పోరుకు వామపక్షాలు సిద్ధమయ్యాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ విద్యుత్ విషయంలో గత ఒప్పందాలు రద్దు చేస్తామని, చార్జీలు పెంచబోమని చెప్పారన్నారు. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించండని ప్రజలకు పిలుపునిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత అదే చంద్రబాబు సీఎంగా ఉండి అప్పుడు మాట్లాడిన మాటలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నించడానికే పార్టీని పెట్టానని చెప్పుకునే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేయమని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.

### నవోదయకు ఎంపిక

ఇబ్రహీంపట్నం: జవహర్ నవోదయ 2025 ప్రవేశ పరీక్షల్లో ఇబ్రహీంపట్నం ప్రతిభ ఇనిస్టిట్యూట్‌కు చెందిన బోను జయవర్దన్ ఎంపికయ్యాడని ఆ సంస్థ డైరెక్టర్ వంకా హరిబాబు బుధవారం తెలిపారు. జనవరి 2025లో దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఎన్‌వీఎస్టీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సీటు సాధించాడని చెప్పారు. జయవర్దన్‌ను డైరెక్టర్ వంకా హరిబాబు జ్ఞాపికతో సత్కరించారు. వంకా హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాస్టర్ ప్రవీణ్‌కు నివాళి



నూజివీడు: రాజమండ్రి హైవేపై అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు పట్టణంలోని నూజివీడు క్రిస్టియన్ ఫెలోషిప్ హాల్‌లో బుధవారం నివాళులర్పించారు. పలువురు దైవజనులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మంచి దైవ సందేశకులని, టీవీ ప్రసంగీకులని, అంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యక్తి మృతి పలు సందేహాలకు తావిస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**విచారణ జరపాలి**

తిరువూరు: అంతర్జాతీయ క్రైస్తవ ప్రబోధకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నందున ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ మాదాసు ఫిలిప్ కోరారు. తిరువూరులోని ఫెలోషిప్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పాస్టర్లపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

### ఈకేవైసీ చేయించుకోవాలి

నూజివీడు: మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరుకు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బత్తిన వెంకట సుబ్బారావు అన్నారు. ఎవరెవరు ఈకేవైసీ చేయించుకోవాలనే జాబితా రేషన్ డీలర్ల వద్ద ఉందని, వారిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈకేవైసీ చేయిస్తేనే వచ్చే నెల రేషన్ సరుకులను ఇస్తారన్నారు.

### పద్మశాలి సంఘీయుల సాయం



తిరువూరు: స్థానిక రాజుపేటలో భర్తను కోల్పోయిన వృద్ధురాలికి తిరువూరు పద్మశాలీయుల సంఘం సభ్యులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మరణించిన బూదాటి సత్యనారాయణ భార్య నాగమణికి కుటుంబ అవసరాల నిమిత్తం రూ.50 వేలు అందజేశామని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు స్వర్గం నాగేశ్వరరావు, పర్వతం రామారావు తెలిపారు. సంయుక్త కార్యదర్శి రామారావు, కోశాధికారి అవ్వారి శౌరి, సంఘ సభ్యులు నాగమణికి ఆర్థికసాయాన్ని ఆమె ఇంటి వద్ద అందజేశారు.

### సారా విక్రేతలకు జరిమానా

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్లో పలుమార్లు సారా విక్రయిస్తూ పట్టుబడిన నిందితులు తహసీల్దార్ల ఎదుట పూచీకత్తు సమర్పించి బైండోవర్‌ను ఉల్లంఘించిన నేరానికి రూ.లక్షా 80 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంకు చెందిన గుంజి అశోక్‌కు తహసీల్దారు రూ.లక్ష జరిమానా విధించారని, ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాకు చెందిన భూక్యా పతీయకు రూ.25 వేలు, విస్సన్నపేట మండలం నరసాపురానికి చెందిన కాటూరి చెన్నారావుకు రూ.25 వేలు, ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాకు చెందిన లావూరి శివకు రూ.30వేలు ఆయా మండల తహసీల్దార్లు జరిమానా విధించారని చెప్పారు.

# ఎమ్మార్ అప్పారావు కాలనీలో సమస్యల తిష్ట

- అభివృద్ధికి నోచుకోని రోడ్లు
- డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- విష పురుగుల సంచారంతో కాలనీ వాసుల భయాందోళన



డ్రెయినేజీ సదుపాయం లేక రోడ్డు వెంట నిల్వ ఉన్న మురుగునీరు

నూజివీడు: పట్టణ శివారులోని అతిపెద్ద కాలనీ ఎమ్మార్ అప్పారావు కాలనీ. నాలుగు వేల గృహాలతో పది వేల మంది జనాభాతో ఉన్న ఈ కాలనీని 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి నిర్మించుకునేలా చేశారు. కాలనీ ఏడాదికేడాదికి అభివృద్ధి చెంది నేడు పది వేల మంది జనాభా నివసిస్తున్నారు. కాలనీలో జనాభా పెరిగింది కానీ, వారికి అవసరమైన సౌకర్యాలు మాత్రం అందుబాటులోకి రాలేదు. దీంతో అసౌకర్యాల నడుమ వారు జీవనం సాగిస్తున్నారు. రోడ్లు అభివృద్ధి కాక, మంచినీటి వసతి లేక, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో పెరిగే పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపించడమే కాకుండా విష పురుగులకు నిలయంగా కాలనీ మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ఈ కాలనీలో ప్రారంభం కాలేదు.

**రోడ్ల అభివృద్ధి ఏదీ?**

ఎమ్మార్ అప్పారావు కాలనీలో రెండు ప్రధాన రహదారులతో పాటు 40 వరకు అంతర్గత రహదారులున్నాయి. వీటిల్లో ఒక ప్రధాన రహదారి మాత్రమే కొంత మేరకు తారురోడ్డుగా గతంలో అభివృద్ధి చేశారు. అలాగే పది అంతర్గత రహదారుల వరకు



ఎమ్మార్ అప్పారావు కాలనీలో అభివృద్ధి చేయాల్సిన ప్రధాన రోడ్డు

గత ప్రభుత్వంలో సిమెంట్ రోడ్లకుగాను, మిగిలిన అన్ని మట్టి రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. గ్రావెల్ రోడ్ల అభివృద్ధికి అప్పట్లో దాదాపు రూ.40 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ప్రధాన తారురోడుకు సీసీ డ్రెయినేజీని నిర్మించడానికి గత ప్రభుత్వంలో రూ.40 లక్షలను కేటాయించి సీసీ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు ప్రారంభం కాలేదనే సాకుతో రూ.40 లక్షలను రద్దు చేయడంతో సీసీ డ్రెయినేజీ పనులు రద్దయ్యాయి. దీంతో ప్రధాన రహదారి వెంబడి ఎక్కడ చూసినా మురుగునీటి మడుగులే దర్శనమిస్తున్నాయి.

**తారురోడ్డు నిర్మాణం చేపట్టాలి**

గతంలో ప్రధాన రహదారిని నూజివీడు–విస్సన్నపేట రోడ్డు నుంచి లెదర్ ఫ్యాక్టరీ మలుపు దాటే వరకు నిర్మించారు. అక్కడి నుంచి తారురోడ్డు చివరికి నిర్మిస్తే ఎమ్మార్ అప్పారావు కాలనీ నుంచి పోతురెడ్డపల్లి వైపునకు వచ్చేందుకు సౌకర్యవంతమైన దారి అందుబాటులోకి వస్తుంది. అంతేకాకుండా పోతురెడ్డిపల్లి, ముసునూరు, ఏలూరు, హనుమాన్ జంక్షన్ వైపునకు వెళ్లాలంటే కాలనీ వాసులకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అలాగే గృహాల వారికి సదుపాయంగా ఉంటుంది.

### అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధి చేయాలి



ఎమ్మార్ అప్పారావు కాలనీలో అంతర్గత రోడ్లతో పాటు డ్రెయినేజీలను కూడా నిర్మించి అభివృద్ధి చేయాలి. రోడ్ల అభివృద్ధి లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీరు ఎక్కడికక్కడే నిలబడి ఉండి దోమలు పెరగడంతో స్థానికులు దోమల బెడదను భరించలేకపోతున్నారు.

– రాయవరపు ప్రసాద్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

### ప్రతిపాదనలు పంపాం



ఎమ్మార్ అప్పారావు కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టులు, వీధి లైట్ల విస్తరణ తదితర మౌలిక సదుపాయల కల్పనకు రూ.2కోట్ల వరకు అవసరం అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. ప్రభుత్వం గ్రాంటును విడుదల చేయాల్సి ఉంది. అది రాగానే పనులు చేపడతాం.

–ఆర్.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నూజివీడు

### నేడు కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

తిరువూరు: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా తిరువూరులో గురువారం సాయంత్రం కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని సత్యసాయి నాట్య మండలి నిర్వాహకులు తెలిపారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని శివాలయం ఆవరణలో త్యాగరాజ గాన కళా సమితి వేదికపై సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొంటారన్నారు.

### దళిత సంఘాల హర్షం

ఆగిరిపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు దళిత సంఘాల నాయకులు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బట్టుమర్తి రాము, బొబ్బర్ల సురేష్, నల్లమోతు కాంచనరావు, తాళ్లూరి నరేష్, దుబ్బాక దేవరాజు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మైలవరం: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. కుమార్ నాయక్ అన్నారు. మైలవరం చైతన్య స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందజేశారు.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



నూజివీడు: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేయాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డివిజన్‌లోని ఆరు మండలాల తహసీల్దార్లు, మిల్లర్లు, కస్టోడియన్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతుకు వెంటనే నగదు జమ అయ్యేలా సంబంధిత డాక్యుమెంట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు కూడా సహకరించాలన్నారు. రబీలో ధాన్యం తక్కువ విస్తీర్ణంలో ఉన్నందున మండలానికి మూడు, నాలుగు చోట్ల మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తహసీల్దార్లు, సివిల్ సప్లై డీటీ, ఏడీఏ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో 'కూటమి' విఫలం

నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు ధ్వజమెత్తారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు బుధవారం ధర్నా నిర్వహించి అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్యం, డ్రెయినేజీ సమస్యలతో పాటు పట్టణంలో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

నూజివీడు: ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పాటు అధిగ దిగుబడులు సాధించవచ్చని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరులో బుధవారం నియోజకవర్గ స్థాయి ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక 2025 వర్క్‌షాపును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలు, అపరాలు, మామిడి తదితర అన్ని రకాల పంటలను ప్రకృతి సేద్యం పద్ధతిలోనే రైతులు సాగు చేసేలా వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సేద్యం డీపీఎం తాతారావు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని వివరించారు. ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఓలు ఎ.చాముండేశ్వరి, చెన్నారావు, సూరిబాబు, శివశంకర్ పాల్గొన్నారు.

# హైవేపై హెచ్చరిక బోర్డుల ఏర్పాటు




దొనబండ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన ప్రమాద హెచ్చరిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ బి. లక్ష్మణరావు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. రమేష్ నగర్ నుంచి దొనబండ గ్రామం వరకు నేషనల్ హైవే 65పై ముఖ్యమైన జంక్షన్లలో డేంజర్ జోన్ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. వాహనాలను నడిపే సమయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమాన్ని సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

### కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: విద్యుత్ రంగ సంస్థల్లో పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజును కోరారు. ఈ మేరకు బుధవారం సమస్యలతో కూడిన వినతిపత్రం ఆయనకు అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### సాంస్కృతిక టీమ్‌కు అభినందన

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌కు చెందిన కల్చరల్ అసోసియేషన్ సభ్యులకు సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సాంస్కృతి పోటీల్లో సంస్థకు చెందిన కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పలువురు విజేతలుగా నిలిచారు. ఇంద్రప్రస్థ నాటికను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలిపిన సభ్యులను అభినందించారు. సంగీతంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించిన సుమలత, దుర్యోధనుడి ఏకపాత్రాభినయం ప్రదర్శనతో రమేష్ ప్రత్యేక బహుమతి, చదరంగం పోటీలో గంగా భవాని తృతీయ స్థానం సాధించడం సంస్థకు గర్వకారణమన్నారు.

### తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.3.04 లక్షలు

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల హుండీ ఆదాయం గత 4 నెలల 26 రోజులకు రూ 3,04,959 లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ తెలిపారు. తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దేవస్థానానికి చెందిన సత్రంలోని వంట పాత్రలు, గ్యాస్ పొయ్యిలు అద్దెకిచ్చే లైసెన్సు హక్కు ఒక సంవత్సర కాలానికి, తలనీలాలు సేకరించుకొను హక్కు, వాహనాల పార్కింగ్ ప్లేస్ లైసెన్స్ హక్కునకు జరిగిన వేలం ద్వారా రూ.3,08,000 ఆదాయం లభించిందని తేజ తెలిపారు.

### కౌలు రైతుల ఆందోళన

విస్సన్నపేట: సొంత భూమి లేని కౌలుదార్లకు కూడా ఉచిత పంట బీమా పథకం వర్తింపజేయాలని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ కోరారు. బుధవారం ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విస్సన్నపేట మండలంలోని నరసాపురం, విస్సన్నపేట రైతు సేవా కేంద్రాల ఎదుట కౌలు రైతులు ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. కౌలుదారుల రక్షణకు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి త్యాగరాజు పాల్గొన్నారు.

### టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: రెండు వారాల పాటు కఫంతో కూడిన దగ్గు, జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా టీబీ పరీక్ష చేయించుకోవాలని గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షేక్ నజ్మా అన్నారు. గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో బుధవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. నూజివీడు టీబీ యూనిట్ హెచ్‌వీ కె.జ్యోతి, ఎస్‌టీఎస్ ఎం.జగన్‌మోహన్ పాల్గొన్నారు.

### సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

చాట్రాయి: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని, దీనికి ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ అన్నారు. మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం, సి-గుడిపాడు, పర్వతాపురం, చిన్నంపేట గ్రామాల్లో సారా నిర్మూలనపై బుధవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా సేవించడం వలన అనారోగ్యాలకు గురవుతూ ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు వీధిన పడుతున్నాయని వివరించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తహసీల్దార్ సుశీలాదేవి

మైలవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రెడ్డిగూడెం తహసీల్దార్ జె. సుశీలాదేవి అన్నారు. రెడ్డిగూడెం గ్రామంలోని ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంకు, ప్రభుత్వాస్పత్రి, మెడికల్ షాపు, రేషన్ షాపును బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఓవర్‌హెడ్ ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి గ్రామస్తులకు మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక జెడ్పీహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. రేషన్ షాపులో సరకులు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య, పంచాయతీ సెక్రటరీ ఎస్. రామారావు, వీఆర్ఓ జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈ క్రాప్ జాబితాల ప్రదర్శన

తిరువూరురూరల్: రబీ వరి పైరు సాగుచేసి, ఈ–పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. కోకిలంపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ–పంట నమోదు తుది జాబితాను రైతులు పరిశీలించుకోవాలన్నారు. రబీ వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులు తమ ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు.

### కరపత్రాల ఆవిష్కరణ

జి.కొండూరు: విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో ఏప్రిల్ 3న జరుగనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య , రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందరావు అన్నారు. కవులూరు గ్రామంలో రైతు సంఘం నాయకులు, స్థానిక రైతులతో సమావేశమై కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం, జాతీయ సహకార చట్టం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అప్పారావు, డాక్టర్ బి. రమేష్‌రెడ్డి

మైలవరం: నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తెలిపారు. విద్యార్థుల అభినందన కార్యక్రమం కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల గుంటూరు చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో, ఖోఖో మహిళల విభాగంలో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని వివరించారు. విజేతలను, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీ రాజ్‌కుమార్‌ను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# నేరాల నియంత్రణకు చర్యలు

ఏసీపీ ప్రసాదరావు



సీసీ కెమేరా వ్యవస్థను ప్రారంభించిన ఏసీపీ ప్రసాదరావు

తిరువూరు: వేసవిలో నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. తిరువూరు పోలీసు స్టేషన్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన 60 సీసీ కెమేరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పట్టణంలో, శివారు ప్రాంతాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశామని, అనుక్షణం సీసీ కెమేరాల్లో రికార్డయ్యే ఫుటేజీని సిబ్బంది పరిశీలిస్తారని చెప్పారు. రోడ్లపై ఆకతాయిలు, నేరస్తుల ఆగడాలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. సీఐ గిరిబాబు, ఎస్ఐ సత్యనారాయణ, తిరువూరు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కొత్తూరు గంగాధర్, సభ్యులు గుడిమెట్ల సతీష్, నాళ్లా మురళి, కుందా వెంకటేశ్వరరావు, గుడిమెట్ల చిన వెంకటేశ్వరరావు, దాతలు పాల్గొన్నారు.

# పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ పొందండి

నూజివీడు: పట్టణంలోని ఆస్తి పన్ను బకాయిదారులు ఈ నెల 31లోగా తమ ఆస్తి పన్ను బకాయిలను చెల్లించి వడ్డీలో 50 శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించి 50 శాతం రాయితీని పొందాలన్నారు.

- కొండపల్లి(ఇబ్రహీంపట్నం):ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా ఏక మొత్తంలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు.

# నేడు ఉప సర్పంచ్ ఎన్నిక

జి.కొండూరు: కట్టుబడిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం జరగనుంది. ఈ గ్రామ పంచాయతీకి 2021లో జరిగిన ఎన్నికల్లో పది వార్డులకు గానూ ఎనిమిది వార్డులు వైఎస్సార్ సీపీ గెలుపొందగా రెండు వార్డులను టీడీపీ దక్కించుకుంది. వైఎస్సార్ సీపీ నుంచి సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన దొంతాల సత్యవతి విజయం సాధించారు. అయితే ముందస్తు ఒప్పందంలో భాగంగా మొదటి రెండున్నర సంవత్సరాలు 8వ వార్డు మెంబరు రమావతు కృష్ణవేణికి ఉప సర్పంచ్‌గా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఏడో వార్డు మెంబరు బాణావతు వెంకటేశ్వరరావుకి ఉప సర్పంచ్‌గా అవకాశం ఇచ్చేందుకు కృష్ణవేణి రాజీనామా చేశారు. ఈ ఎన్నికకు ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో గురువారం ఎన్నిక జరుగనుంది.

- ఇబ్రహీంపట్నం: మండలంలోని తుమ్మలపాలెం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక గురువారం జరుగనుంది. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున బొమ్ము వెంకటరమణ సర్పంచిగా ఎన్నికయ్యారు. పది వార్డుల్లో ఆరు వార్డులు వైఎస్సార్ సీపీ, రెండు వార్డులు టీడీపీ, రెండు వార్డులు జనసేన కైవసం చేసుకున్నాయి. ఉప సర్పంచిగా బీసీకి చెందిన నాతి ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు. రెండున్నరేళ్ల ఒప్పందం మేరకు ఆదిలక్ష్మితో రాజీనామా చేయించి ఎస్సీ వర్గానికి చెందిన నందూరు బేబీని ఉప సర్పంచి అభ్యర్థిగా నాయకులు ప్రకటించారు.

### టెన్త్ పరీక్షకు 71 మంది గైర్హాజరు

నూజివీడు: నియోజకవర్గ పరిధిలోని 18 పరీక్షా కేంద్రాల్లో బుధవారం భౌతికశాస్త్రం పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. 3,488 మంది విద్యార్థులకు గాను 71 మంది గైర్హాజరు కాగా 3,417 మంది పరీక్ష రాశారు.

### టెన్త్ పరీక్ష కేంద్రం తనిఖీ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూల్ పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి బుధవారం తనిఖీ చేశారు. పరీక్షల్లో ఎటువంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆర్డీఓ ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.